# ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా సామ్రాజ్యవాదుల బాంబుదాడి

**13-4-2017న** అమెరికా సైన్యం ఆఫ్ఘనిస్తాన్‌పై జిపిఎస్(గ్లోబల్ పొజిషన్ సిస్టిమ్) ద్వారా 21,600 పౌండ్లు బరువు కల్గిన అణురహిత బాంబును వేసినట్లు ప్రకటించింది. 'మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్'గా పిలువబడే జిబియు-43/బి మాసివ్ ఆర్డినెన్స్ ఎయిర్ బ్లాస్ట్ (ఎంఓఏబి) అనబడే ఈ బాంబు స్థానిక కాలమానం ప్రకారం ఆరోజు సాయంత్రం 7.32 ని॥లకు ప్రయోగించ బడింది. ఈ బాంబు అణుధార్మికతను వెదజల్లదు తప్ప, రెండు కిలోమీటర్ల పరిధిలో అణుబాంబు చేసే విధ్వంసాన్నంతా చేయగలదు. కానీ అమెరికా ఈ బాంబు ప్రభావం వల్ల 95 వేలమంది జనాభా కలిగిన ప్రాంతంలో ఇస్లామిక్ స్టేట్ టెర్రరిస్టులు 38 మంది మాత్రమే చనిపోయినట్లు ప్రకటించింది. చాలామంది సాధారణ పౌరులు చనిపోయినట్లు వార్తలు వెలువడగానే వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ సీన్ స్పైసర్ సాధారణ పౌరులు మరణించకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని చెప్పాడు. ఇది తాము చేసిన విధ్వంసాన్ని కప్పిపుచ్చుకోవటానికి చేసిన వ్యాఖ్య తప్ప మరోటి కాదు. మరోసారి అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజలను భయపెట్టటానికి తన జూలును విదిల్చింది.

ఈ చర్యను చేపట్టటానికి గల సరియైన కారణాన్ని అమెరికా చెప్పలేకపోయింది. ఇస్లామిక్ స్టేట్ టెర్రరిస్టులకు వ్యతిరేకంగా సాగిస్తున్న పోరులో భాగంగా దీన్ని పేర్కొంది. ఆఫ్ఘనిస్తాన్‌లో 9000 మంది అమెరికా సైనికులు, వారితోపాటు అమెరికా కనుసన్నలలోని ఆఫ్ఘన్ జాతీయ సైన్యం ఉన్నాయి. అలాంటప్పుడు వేల కిలోమీటర్ల దూరం నుండి బాంబు వేయాల్సిన అవసరం అమెరికాకు ఎందుకు కలిగింది?

ఇంకా ఈ బాంబు ధూళి అణగకముందే 22-4-2017న ఉత్తర ఆఫ్ఘనిస్తాన్‌లోని మజర్-ఈ -షరీఫ్ వద్ద గల అమెరికా సైనిక స్థావరంపై తాలిబన్లు దాడి చేశారు. ఈ దాడిలో 140 మంది అమెరికా సైనికులు చనిపోయారంటున్నారు. ఆఫ్ఘన్ ప్రభుత్వం ఇరకాటంలో పడిపోయింది. దాడి జరిగిన బాల్కా ప్రాంతపు ప్రొవిన్షియల్ కమిటీ సభ్యుడొకరు శవపేటికల కొరత ఏర్పడిందని అన్నాడు. ఆఫ్ఘన్ రక్షణమంత్రి, ఆఫ్ఘన్ సైనికాధికారి తాలిబన్ల దాడి కారణంగా రాజీనామా చేశారు. ప్రభుత్వం నాలుగు సైనిక పటాలాల కమాండర్లను మార్చివేసింది. తాలిబన్లకు సహకరించారనే అనుమానంతో 8 మంది సైనికులను అరెస్టు చేసింది.

విచిత్రంగా ఆఫ్ఘన్‌పై ఎంఓఏబి బాంబు దాడి అనంతరం అమెరికా ఉపాధ్యక్షుడు, రక్షణశాఖ మంత్రి వంటివారు ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, దక్షిణ కొరియా, జపాన్, భారతదేశాల పర్యటనకు పూనుకున్నారు. ఈ పర్యటన సానుకూల పరిస్థితులను కల్పిస్తుందని వారు భావించి వుండవచ్చు. దీనికి భిన్నంగా వారికేమాత్రం మింగుడు పడని విధంగా తాలిబన్ల దాడి జరిగింది. వారి ఆఫ్ఘన్ తొత్తులు సంక్షోభంలో, అంతర్గత కలహాలతో ఉన్నారని వారికర్థమైంది.

ఇక్కడ ఇంకో విషయముంది. ఒకప్పటి ఆఫ్ఘను అధ్యక్షుడు, అమెరికాకు నమ్మిన బంటు అయిన హమీద్ కర్జాయ్ ఇప్పుడు అమెరికాపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాడు. 'ది హిందూ'కిచ్చిన ఒక ఇంటర్వ్యూలో అతను "నంగార్హర్ ప్రావిన్సులోని షిన్వార్ జిల్లాలో ఇస్లామిక్ స్టేట్ ప్రవేశించినప్పుడు, మన ప్రజలను అవమానించినప్పుడు, గ్రామాలను ఖాళీ చేయిస్తున్నప్పుడు అడ్డుకోకుండా, రెండున్నర నుండి మూడు సంవత్సరాలు అమెరికా సైన్యం చూస్తూ మిన్నకున్నారు. స్థానిక ప్రజలు ఇస్లామిక్ స్టేట్‌కు వ్యతిరేకంగా ఉద్యమించినప్పుడు ప్రజలకు సహాయం చేయాల్సింది పోయి, అమెరికా వైమానిక దళ విమానాలు ఇస్లామిక్ స్టేట్‌కు వ్యతిరేకంగా ప్రజలు ఏర్పాటు చేసుకొన్న రక్షణ వ్యవస్థలపై గురిపెట్టాయి" అన్నాడు. మరో ప్రశ్నకు సమాధానంగా కర్జాయ్ ఇలా చెప్పాడు : "ఆ తర్వాత ఇస్లామిక్ స్టేట్‌ను అణచటం పేరుతో అమెరికా వచ్చి దాడి చేస్తోంది. అది కూడా విధ్వంసకర బాంబులతో. ఇది ఇస్లామిక్ స్టేట్‌కు వ్యతిరేకంగా కాదు. అమెరికా యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఆఫ్ఘనిస్తాన్‌లో తమ బాంబును పరీక్షించటం, అదే సమయంలో వారి శత్రువులకు కఠినమైన హెచ్చరికలు జారీ చేయటం" ('ది హిందూ' 3.5.2017)

ప్రపంచంలోని అనేక టెర్రరిస్టు గ్రూపులకు వెన్నుదన్నుగా ఉన్నది అమెరికా సామ్రాజ్యవాదులే. వారి ఆధిపత్య రాజకీయాలలో ఒక భాగమే ఇస్లామిక్ స్టేట్. టెర్రరిస్టు గ్రూపులను తయారుచెయ్యటం, ఆనక టెర్రరిజంపై పోరు అంటూ యుద్ధాలకు దిగటం వెనుక కారణం స్పష్టమే. తాము దోపిడీ చేస్తున్న ప్రాంతాలను కాపాడుకోవటం, విస్తరించటం తద్వారా ప్రపంచంపై ఆధిపత్యాన్ని ప్రదర్శించటం. సామ్రాజ్యవాదులు టెర్రరిజానికి వ్యతిరేకమనే భ్రమలు ఎవరికీ ఉండాల్సిన అవసరంలేదు. టెర్రరిజంపై పోరు పేరుతో సామ్రాజ్యవాదుల సహాయం కోరటంగానీ, పొత్తులు పెట్టుకోవటంగానీ నిరుపయోగం. ఈ విషయంలో అమెరికాను నమ్మటమంటే తమను తాము మోసం చేసుకోవటమేకాక ప్రపంచ ప్రజలను కూడా మోసం చేయటమే. ఆఫ్ఘన్ ప్రజల అనుభవం కూడా అదే. అమెరికా సామ్రాజ్యవాదులు ఇస్లామిక్ స్టేట్ టెర్రరిజమనే విధానాన్ని ఆఫ్ఘనిస్తాన్‌లో ఉపయోగించి, తర్వాత దానిపై పోరు పేరుతో ఆఫ్ఘన్ ప్రజలకు, వారి పోరాటాలకు కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నారు.

2017 ఏప్రిల్ 17న అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ దక్షిణ కొరియాలో మాట్లాడుతూ సిరియాపై, ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా చేసిన దాడులు - డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాన్ని తెలియజేస్తున్నాయని, దానిని పరీక్షించరాదన్నాడు. దుందుడుకు విధానాలను అమలు చేయటంలో డొనాల్డ్ ట్రంప్ గత నిరంకుశ పాలకులకేమీ తీసిపోడని అమెరికా ఈ దాడుల ద్వారా ప్రపంచానికి తెలియజేయాలనుకున్నది. గతంలో చేసిన తీవ్ర తప్పిదాలనే తిరిగి కొనసాగించే పక్షంలో ప్రపంచ ప్రజల అంతులేని ఆగ్రహాన్ని, తీవ్రమైన పరిణామాలను అమెరికా సామ్రాజ్యవాదులు చవిచూడక తప్పదు.

ooooo